గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్టు

మారేడ్‌పల్లి, ఆగస్టు 5: రైల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన బాలికను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి, రూ.3,50,000 విలువ చేసే 14 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కరణ్ శశిరావు పవార్, దీపక్ శశిరావు పవార్ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి దందాను మొదలుపెట్టారు. తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం వేశారు. ఇదే క్రమంలో 17 ఏండ్ల ఓ బాలికతో కలిసి వీరిద్దరు ఒడిశాలోని ఛత్రపూర్ వెళ్లి అక్కడ తక్కువ ధరకు 14 కిలో గంజాయిని కొనుగోలు చేశారు. ఈ ముఠా సభ్యులు విజయనగరం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి.. గంజాయి బ్యాగులను రైల్లో సీట్ల కింద పెట్టారు. రైలు ఈ నెల 3న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నంబర్ 7లోకి చేరుకుంది. ఆ తర్వాత కరణ్ శశిరావు పవార్, దీపక్ శశిరావు పవార్ కలిసి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు రైల్వే స్టేషన్ నుంచి బయటకు వెళ్లారు. బాలికను గంజాయి ఉన్న బ్యాగ్‌ల వద్ద ఉంచారు. మధ్యాహ్నం వరకు బయటకు వెళ్లిన ఇద్దరూ తిరిగి రాలేదు. ఈ క్రమంలో రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ఒంటరిగా ఉన్న బాలికను గమనించారు. ఆమె వద్దకు వెళ్లిన పోలీసులు అక్కడున్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఆ బాలికను అదుపులోకి తీసుకొని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు.

బోనాల జాతరలో 305 పోకిరీలు

క్యాబ్ డ్రైవర్‌కు ఆరు రోజుల జైలు

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకల్లో 305 మంది పోకిరీలను పట్టుకున్నట్లు మహిళా భద్రత డీసీపీ కవిత తెలిపారు. గోల్కొండ, సికింద్రాబాద్, లాల్‌దర్వాజ, బల్కంపేటలో బోనాల పండుగ సందర్భంగా షీ టీమ్స్ నిఘా పెట్టాయి. వేడుకల్లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిని గుర్తించి పట్టుకున్నట్టు డీసీపీ తెలిపారు. పట్టుబడ్డ 305 మందిలో 16 మంది మైనర్లు మినహా మిగతా వారంత మేజర్లని, ఇందులో 173 మందిని హెచ్చరించి, కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్టు తెలిపారు. ఐదుగురిని కోర్టులో హాజరుపర్చడంతో వారికి మూడు రోజుల జైలు శిక్ష పడిందన్నారు. మిగతా వారిని త్వరలోనే కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కాగా, జూలై నెలలో 115 ఫిర్యాదులు షీ టీమ్స్ అందాయని, అందులో 19 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. వాటిలో 4 కేసులు అదనంగా పోక్సో చట్టం కింద నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలాఉండగా.. ఉదయం సమయంలో ఎయిర్‌పోర్టుకు ప్రయాణించే వారిపై క్యాబ్ డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేయడంతో బాధితులు షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో క్యాబ్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చడంతో నిందితుడికి ఆరు రోజుల జైలు శిక్ష పడిందని డీసీపీ తెలిపారు.

బర్త్ 'డే' పార్టీలో విషాదం

మూడో అంతస్తు నుంచి పడి హెడ్ కానిస్టేబుల్ మృతి

మూసాపేట, ఆగస్టు 5: బర్త్ డే పార్టీలో విషాదం చోటు చేసుకుంది. మూడో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తు కథనం ప్రకారం.. హెచ్ఎంటీ హిల్స్ శాతవాహనకాలనీకి చెందిన శేఖర్ రాచకొండ పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం శేఖర్ పుట్టిన రోజు సందర్భంగా 1వ బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ (56)ను ఆహ్వానించాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ప్రార్థనలు ముగించారు. ఆ తర్వాత భోజనాలు చేసే సమయంలో డేవిడ్ బాత్‌రూమ్ వెళ్లే క్రమంలో మూడో అంతస్తు మోట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద ఉన్న చెట్టుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. శేఖర్ తన కారులో స్థానిక ప్రైమ్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య హేమ ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెటాలియన్‌లో విషాదఛాయలు..

జూబ్లీహిల్స్, ఆగస్టు 5: టీఎస్ఎస్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ మృతితో ఫస్ట్ బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాచకొండ కమిషనరేట్ కంట్రోల్ రూమ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ.. నగరంలోని హెచ్ఎంటీ హిల్స్ శాతవాహన కాలనీలో నివాసముంటున్నాడు. శేఖర్ బర్త్‌డే పార్టీకి వెళ్లిన డేవిడ్.. ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి జారి పడి.. గాయాలతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అయిన డేవిడ్ ప్రథమ పటాలంలో చీఫ్ ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పటాలంలో మీడియా కో -ఆర్డినేటర్‌గా, యూసుఫ్‌గూడలోని వెంకటగిరి చర్చిలో నాయకుడిగా వ్యవహరిస్తూ అందరితో కలుపుగోలుగా ఉండేవారని, రహ్మత్‌నగర్‌లో నివాసముండే డేవిడ్‌కు భార్య, ఎంటెక్ చదువుతున్న కూతురు ఉన్నదని తెలిపారు. కుమార్తె లండన్‌లో ఉండటంతో అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నారు. డేవిడ్ పార్థివ దేహాన్ని యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో సందర్శనార్థం ఉంచారు. వెంకటగిరిలోని మెథడిస్ట్ చర్చిలో ప్రార్థనల అనంతరం బోరబండ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్యాంక్‌బండ్‌పై కారు బీభత్సం

ఖైరతాబాద్, ఆగస్టు 5 : ట్యాంక్‌బండ్‌పై ఓ కారు బీభత్సం సృష్టించింది. ఎన్టీఆర్ మార్గ్‌లో కొందరు యువకులు ప్రయాణిస్తున్న కారు పలు వాహనాలను ఢీకొట్టడంతో స్థానికుల వెంబడించారు. దీంతో భయంతో అక్కడే ఓ డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. కారులో నుంచి దిగి పారిపోయేందుకు యత్నిస్తున్న వారిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సైఫాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన జావేద్, అల్తాఫ్, అబుబాకర్, ముజమ్మిల్ విద్యార్థులు. కారులో షీకారు చేసేందుకు సంతోష్‌నగర్‌కు బయలుదేరారు. ఎన్టీఆర్ మార్గ్‌లో అతివేగంతో దూసుకెళ్తూ.. ట్యాంక్‌బండ్‌పై పలు వాహనాలను ఢీకొట్టారు. దీంతో స్థానికులు వారిని వెంబడించడంతో భయంతో ఓ డివైడర్‌ను ఢీకొట్టారు. ఆ సమయంలో ఎయిర్ బ్యాగులు తెర్చుకోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. బాటసారులు పోలీసులకు సమాచారం అందించగా, వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న నిమ్స్ సెక్యూరిటీ గార్డులు

నిమ్స్‌లో సెక్యూరిటీ లేని జీవితాలు

రెండు నెలలుగా అందని వేతనాలు

ఒక్క రోజు సెలవు పెడితే.. రూ. 500 కట్..

విధుల బహిష్కరణ.. పంజాగుట్ట పీఎస్‌లో సెక్యూరిటీ గార్డుల ఫిర్యాదు

ఖైరతాబాద్, ఆగస్టు 5 : నిమ్స్ దవాఖానకు 24 గంటల పాటు రక్షణ ఉండే సెక్యూరిటీ గార్డుల జీవితాలకు రక్షణ లేకుండా పోయింది. నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. రోజూ సుమారు 2వేలకు పైగా మంది వివిధ చికిత్సల కోసం వస్తారు. ఈ నేపథ్యంలో వారు వైద్యులను కలిసి, చికిత్స తీసుకొని తిరిగి సురక్షితంగా వెళ్లేంత వరకు వారిని అంటిపెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తారు సెక్యూరిటీ గార్డులు. అయితే, వారికి సరైన వేతన వ్యవస్థ లేకపోవడంతో ప్రైవేట్ ఏజెన్సీల దాష్టికానికి బలవుతూ.. సమయానికి వేతనాలు లేక బతుకు జీవుడా అంటూ కాలం వెల్లదీస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కిరాయి ఇండ్లలో ఉంటూ పిల్లలను చదివించుకుంటూ సమయానికి వేతనాలు రాక అప్పులపాలవుతున్నారు. దశాబ్ద కాలంగా నిమ్స్ సెక్యూరిటీ గార్డులు ప్రైవేట్ ఏజెన్సీల చేతుల్లో నలిగిపోతున్నారు. ఎవరిని కదిలించినా.. వారి కష్టాలు చెప్పుకొని కన్నీంటి పర్యంతమవుతున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేక, అసంఘటితరంగం కంటే అధ్వానమైన జీవితాలు గడుపుతున్నారు. గత రెండు నెలలుగా సదరు ఏజెన్సీ వేతనాలు చెల్లించకపోవడంతో ఆందోళన బాట పట్టారు. మరో వైపు మహిళా సెక్యూరిటీ గార్డుల వేతలు చెప్పనలవి కాదు. గతంలో కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులపై వివిధ రకాలుగా వేధింపులు జరిగిన ఘటనలు సైతం నిమ్స్ దవాఖానలో చోటు చేసుకున్నట్లు సమాచారం. మరో వైపు వేతనాలు రాక, కుటుంబాలను పోషించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సోమవారం విధులను బహిష్కరించిన సెక్యూరిటీ గార్డులు.. పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వచ్చే చాలీ చాలని వేతనాలు కూడా చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని, యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఒక్క రోజు సెలవు పెట్టినా..

నిమ్స్ దవాఖానలో క్యాపిటల్ ఏజెన్సీ కింద సుమారు 105 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికీ నిర్ణీత వేతనం కనీసం నెలకు రూ.15,600 చెల్లించాల్సి ఉంది. కానీ సదరు ఏజెన్సీ మాత్రం సెక్యూరిటీ గార్డులకు రూ.11,500 మాత్రమే చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్నది. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క కార్మికుడికి పనిదినాలు, పనివేళాలు ఉంటాయి. కానీ నిమ్స్ సెక్యూరిటీ గార్డులది మాత్రం వెట్టి చాకిరి అంటున్నారు. నెలకు నాలుగు వీక్లీ ఆఫ్‌లు ఉన్నాయి. అయితే ఆ నిబంధనలు వీరికి వర్తించవు. ఒక్క రోజు సెలవు పెట్టినా రూ.500 వారి వేతనం నుంచి కట్ చేస్తారు.

ఇంటికి నేనే ఆధారం

నిమ్స్ దవాఖానలో పదేండ్లుగా పనిచేస్తున్నాను. అన్ని సంవత్సరాలుగా నాది అదే పరిస్థితి. ఏజెన్సీల దయాదాక్షిణ్యాల మీద గడుపాల్సి వస్తున్నది. నా భర్త పనిచేయలేని స్థితిలో ఉన్నాడు. ఇంటి మొత్తానికి నేనే ఆధారం. రెండు నెలలుగా జీతాలు రాక పోవడంతో అక్కడక్కడ అప్పులు తీసుకొని.. కాలం వెల్లదీస్తున్నా. మా గోడు వినే వారే లేరు.

- పావని, నిమ్స్ మహిళా సెక్యూరిటీ గార్డు

భర్త చనిపోవడంతో..

నా భర్త చనిపోవడంతో కుటుంబ భారమంతా నాపైనే పడింది. నాకు బాబు, పాప ఉన్నారు. ఒకరు 9వ తరగతి, మరొకరు 8వ తరగతి చదువుతున్నారు. కిరాయి ఇంట్లో ఉంటూ వారిని చదివించుకునేందుకు అనేక కష్టాలు పడుతున్నాను. నా పిల్లల పోషణకు నా సంపాదనే దిక్కు. పిల్లల చదువులకు సరిపోకపోవడం వల్ల అప్పులు చేయాల్సి వస్తున్నది. అత్యంత దుర్భరమైన జీవితాలను గడుపుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కె.కవిత, నిమ్స్ మహిళా సెక్యూరిటీ గార్డు

డీఐ రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 5: దొంగతనం చేసిందనే అభియోగంతో దళిత మహిళ సునీతను చిత్రహింసలు పెట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన షాద్‌నగర్ పీఎస్ డీఐ రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొంగతనం కేసులో పోలీసులు సమగ్రమైన విచారణ చేయకుండానే.. నేరం ఒప్పుకోవాలని ఓ మహిళపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధితురాలు సునీత, ఆమె భర్త భీమయ్య, కుమారుడు జగదీశ్‌ను సైతం కర్రలతో చితకబాదడం దురదృష్టకరమన్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. డీఐ రామిరెడ్డితోపాటు కానిస్టేబుళ్లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించి, ఆ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియాను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దళితులపై దాడులు ఎక్కువయ్యాయి: కేవీపీఎస్

అంబర్‌పేట, ఆగస్టు 5: దళితులపై దాడులు పెరిగిపోవడంతో కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) ఆధ్వర్యంలో సోమవారం శివం రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. దొంగతనం పేరుతో షాద్‌నగర్ పోలీసులు దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్, నగర కార్యదర్శి బి.సుబ్బారావు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలో దళితులపై దాడులు, హత్యలు, లైంగికదాడులు జరుగుతున్నాయన్నారు. అశ్వరావుపేటలో దళిత ఎస్సై ఆత్మహత్య మరువక ముందే షాద్‌నగర్‌లో మరో ఘటన చోటు చేసుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం తలదించుకునేలా పోలీసుల వ్యవహారశైలి ఉన్నదని విమర్శించారు. డీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మహేందర్, జి.రాములు, వి.వరలక్ష్మి, షబానా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

వనస్థలిపురం, ఆగస్టు 5 : ఇండ్లలో పనిచేసుకుంటూ జీవిస్తున్న ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. వనస్థలిపురం శ్రీకృష్ణనగర్ కాలనీలో నివాసముండే చీమల బాలమ్మ(63) ఇండ్లలో పనిచేసుకుంటూ..చిన్న గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నది. శనివారం పనికి రాకపోవడంతో పక్కనే ఉండేవారు వెళ్లి చూడగా, బాలమ్మ చనిపోయి ఉంది. ఆమె తలపై రాయితో బాధినట్టు ఉన్నది. హత్యగా భావిస్తున్న పోలీసులు.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

బాలిక కిడ్నాప్ కేసులో.. నిందితుడిని కస్టడీకి కోరుతూ పిటిషన్

అబిడ్స్, ఆగస్టు 5: బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని విచారణ నిమిత్తం వారం రోజులపాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ అబిడ్స్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కట్టెలమండిలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆరేండ్ల బాలికను శనివారం సాయంత్రం మహ్మద్ బిలాల్ అన్సారీ కిడ్నాప్ చేసి, ఆటో రిక్షాలో అఫ్జల్‌గంజ్ వరకు.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కొత్తూరు సమీపంలోని యనామల్ సర్వే గ్రామానికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. కిడ్నాప్‌నకు గురైన బాలికను ఆదివారం ఉదయం పోలీసులు గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. నిందితుడిపై కిడ్నాప్, లైంగికదాడికి యత్నం, దొంగతనం, పోక్సో కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు నిర్ణయం తీసుకోనున్నది. నిందితుడిపై గత నెలలో కూడా కొత్తూరు పీఎస్‌లో బాలిక కిడ్నాప్, లైంగికదాడి కేసు నమోదైంది. అబిడ్స్‌లో బాలిక కిడ్నాప్ కేసులో పోలీసులు సకాలంలో స్పందించి, కిడ్నాపర్ చెర నుంచి రక్షించడంతో పోలీసు ఉన్నతాధికారులు అబిడ్స్ పోలీసులను అభినందించారు. ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, సీఐ రాజగోపాల్ రెడ్డి, ఇతర అధికారులను స్థానికులు సైతం ప్రశంసించారు. స్థానిక యువకులు సైతం 50 మందికి పైగా పోలీసులకు సహకరించి, వాహనాలపై బాలిక ఆచూకీ కనుగొనేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు.

పై ఓవర్ నుంచి దూకిండు..

బండ్లగూడ,ఆగస్టు 5 : అత్తాపూర్‌లోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి పిల్లర్ నంబర్ 147 నుంచి కిందకు దూకే యత్నం చేయగా.. అతడిని స్థానికులు వారించారు. సర్ది చెప్పినా వినకుండా కొద్దిసేపట్లోనే కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అత్తాపూర్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. బాధితుడికి సంబంధించిన వివరాలు తెలియలేదు. అతడికి మతిస్థిమితం లేకపోయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

యజమానిపై దాడి | చికిత్స పొందుతూ యజమాని బంధువు మృతి

వెంగళరావునగర్, ఆగస్టు 5: బల్కంపేటలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇంటి అద్దె వసులు చేయడం కోసం వచ్చిన యజమానులపై అద్దెకు ఉంటున్న కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి ఎ.పద్మజకు బల్కంపేటలోని జేవీఆర్ రెసిడెన్సీలో ఓ ఫ్లాట్ ఉన్నది. ఈ ఫ్లాట్‌ను కడియం నీలకంఠేశ్వర్‌రావు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. గత నాలుగు నెలలుగా నీల కంఠేశ్వర్‌రావు అద్దె చెల్లించడంలేదు. ఫ్లాట్‌ను కూడా ఖాళీ చేయడం లేదు. దీంతో 3వ తేదీ మధ్యాహ్నం ఇంటి యజమానులైన పద్మజ, ఆమె భర్త సుబ్బారావు, సోదరి సువర్ణలత, బావ వెంకటేశ్వర్‌రావు (65) తదితరులు జేవీఆర్ రెసిడెన్సీలోని 101 ఫ్లాట్‌కు వెళ్లారు. ఫ్లాట్ గడియ పెట్టి ఉండటంతో ఇంటి యజమాని పద్మజ సోదరి సువర్ణలత తలుపు తట్టింది. లోపల ఉన్న నీల కంఠేశ్వర్‌రావు కుమారుడు కొంచెం తలుపు తెరిచాడు. దీంతో సువర్ణలత ఇంట్లోకి వెళ్లేందుకు ఒక కాలు, చెయ్యి లోనికి పెట్టింది. వెంటనే నీలకంఠేశ్వర్‌రావు కూమారుడు బలంగా తలుపును తోశాడు. ఊహించని ఘటనలో సువర్ణలత కాలు, చెయ్యి తలుపులో ఇరుక్కుపోయి కేకలు వేసింది. తీవ్ర గాయాలయ్యాయి. అ తర్వాత లోనికి వెళ్లిన వీరు నీలకంఠేశ్వర్‌రావు, అతడి భార్య రాజ్యలక్ష్మి, కుమారుడితో వాగ్వాదానికి దిగారు. కోపంతో నీలకంఠేశ్వర్‌రావు వెంకటేశ్వర్‌రావుపై దాడిచేసి వెనక్కు నెట్టేశాడు. కిందపడిన బాధితుడికి భుజాలు, తుంటి భాగంలో ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్‌రావు సోమవారం మృతి చెందాడు. అంతకు ముందు దాడి ఘటనపై నీలకంఠేశ్వర్‌రావు, అతడి భార్య రాజ్యలక్ష్మి, కుమారుడిపై కేసు నమోదు చేసిన ఎస్ఆర్ నగర్ పోలీసులు.. బాధితుడు మృతి చెందడంతో మరిన్ని సెక్షన్లు జోడించి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.200 కోసం కొట్టి చంపారు

నిందితులను కఠినంగా శిక్షించాలి

నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- బాధిత కుటుంబ సభ్యులు

బండ్లగూడ, ఆగస్టు 5 : క్యాబ్ చార్జీ రూ. 200 ఇవ్వమన్నందుకు కొందరు దుండగులు ఒక రైతు బిడ్డను దారుణంగా కొట్టి, అతడి మృతికి కారణమయ్యారు. ఈ ఘటనలో యువకుడి మృతికి రాజేంద్రనగర్ పోలీసులు సైతం కారణమయ్యారంటూ బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు రెండేండ్ల పాటు చికిత్స పొందుతూ.. ఈ నెల 4న మృతి చెందాడు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన అంజయ్యగౌడ్, వెంకటమ్మది రైతు కుటుంబం. వీరికి నలుగురు ఆడపిల్లలు కాగా, వెంకటేశ్ గౌడ్ ఏకైక మగ సంతానం. డిగ్రీ పూర్తి చేసిన వెంకటేశ్ ఎస్ఐ పరీక్షకు సిద్ధమయ్యేందుకు నగరానికి వచ్చి, ఎల్బీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉన్నాడు. ఉదయం పూట చదువుకుంటూ.. రాత్రి సమయంలో క్యాబ్ నడుపుతూ ఎస్ఐ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఇదిలా ఉండగా.. 2022 జూలై 31న రాత్రి రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లికి చెందిన వివేక్‌రెడ్డి బీఎన్‌రెడ్డి నగర్ నుంచి ఉప్పర్‌పల్లికి క్యాబ్ బుక్ చేసుకున్నాడు. బుకింగ్ అందుకున్న వెంకటేశ్‌గౌడ్.. వివేక్‌రెడ్డిని తన క్యాబ్‌లో ఉప్పర్‌పల్లికి చేర్చాడు. అనంతరం క్యాబ్ చార్జ్ రూ.900 అయ్యిందని వివేక్‌కు చూపించాడు. వివేక్‌రెడ్డి మాత్రం రూ.700 ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వివేక్‌రెడ్డి ఫోన్‌చేసి తన స్నేహితులను అక్కడి రప్పించుకున్నాడు. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు వంటివాటితో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న వివేక్ స్నేహితులు కలిసి విచక్షణా రహితంగా వెంకటేశ్ గౌడ్‌ను కొట్టారు. దెబ్బలకు తాళలేక కాళ్లు పట్టుకున్నా.. కనికరం లేని వివేక్‌రెడ్డి, అతడి స్నేహితులు బాధితుడిని పట్టుకుని చైన్ స్నాచింగ్ చేయబోయాడంటూ తప్పుడు ఫిర్యాదు చేసి, రాజేంద్ర నగర్ పోలీసులకు అప్పగించారు. దీనిపై సరిగ్గా విచారణ చేయని పోలీసులు.. తీవ్రంగా గాయపడిన బాధితుడిని దవాఖానకు కూడా పంపించలేదు. ఆ రోజు రాత్రి నుంచి ఉదయం వరకు ఠాణాలో ఉంచి, దాడికి పాల్పడిన గూండాలను వదిలేశారు. అయితే, దుండగుల చేతిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్ గౌడ్ మరుసటి రోజు ఉదయం స్పృహ తప్పి పడిపోయాడు. ఇది గమనించిన పోలీసులు వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అప్పటికే బాధితుడు తీవ్రమైన గాయాల వల్ల పరిస్థితి విషమించి, కోమాలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి రెండేండ్ల పాటు చికిత్స పొందుతూ మంచాన పడిన వెంకటేశ్ గౌడ్ ఆదివారం మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి వెంకటేశ్‌ను దవాఖానకు తరలించి ఉంటే.. ఈ రోజు తమ కుమారుడు బతికేవాడని మృతుడి కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు. తమ కొడుకును కొట్టి చంపి, యథేచ్ఛగా బెయిల్‌పై బయట తిరుగుతున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు 2022లో జరిగిన ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బీమా పేరుతో మోసం

రూ.1,47,395 నగదు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఘట్‌కేసర్, ఆగస్టు 5: మాయమాటలు చెప్పి, ఆర్టీసీ ఉద్యోగి క్రెడిట్ కార్డు నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,47,395 నగదును కొట్టేశారు. ఈ ఘటన పోచారం పోలీస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకటరామ్ చౌదరీగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అరుంధతీ కాలనీలో ఉంటున్నాడు. జూలై 31న గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఇండస్ ఇండ్ క్రెడిట్ కార్డు డిపార్టుమెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ పంపాము.. యాక్టీవ్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పలు విషయాలు వెంకటరామ్‌ను అడిగి, అతడి వద్ద ఉన్న క్రెడిట్ కార్డు వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత ఓటీపీ నంబర్‌ను కూడా తెలుసుకున్నారు. అన్ని వివరాలు పూరించిన బాధితుడు ఓకే బటన్ నొక్కడంతో క్రెడిట్ కార్డు నుంచి రూ.1,47,395 పోయాయి. అనంతరం బాధితుడి ఖాతా నుంచి డబ్బులు పోయినట్టు మెసేజ్ వచ్చింది. మోసపోయినట్టు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

కాచిగూడ, ఆగస్టు 5: జల్సాలకు అలవాటు పడి.. రద్దీగా ఉన్న ప్రాంతాలను